
# కహానీ

## శ్రీ మల్లాది వేంకటకృష్ణశర్మ

ఒకసందులో యిల్లు; చుట్టూ బ్రాహ్మణగృహాలు కదా అన్న ఆశతో ఆయింట్లో ప్రవేశించాను. పూరిల్లైనా నివాసయోగ్యంగానే ఉంది.

ఉదయం 7 గంటలమొదలు సామాన్లు ఇంట్లో సర్దుతున్నాను. ఒంటిమనిషిని, మారు సహాయంలేదు, సామాను చూస్తే కొండంతయెత్తుంది. మా ఆఫీసు బంట్రోతు సహాయంతో ఎలాగైతేనేమి 12 గంటవరకూ సామాను సవరించి హోటలుకుపోయి రెండు మెతుకులుతిని, కాస్త విశ్రాంతి తీసుకోవాలని ఏకాయెకీని ఇంటికొచ్చి వరండా అరుగుమీద వాలేను - ఆ వీధి క్రొత్తకావడంచేత ఇరుగు పొరుగులెవరుకాని బాతాఖానీకి దొరకలేదు - ఆయాసపడి ఉండడంచేత చిన్న కునుకు ప్రారంభమయింది. ఇంతలో పొరుగింటివీధి గడపనుంచి "ఇవాళ నీహతం ఆర్చకపోతే బ్రాహ్మణ్ణికాను. ఇంట్లో రక్తకల్లోలు జరిగితీరతాయి. పాడుముండా - ఇన్నాళ్లూ ఓర్చాను. కాని ఇహ ఓర్చను. నీకు ఆయుర్దాయం చెల్లిపోయింది" ఈమాటలువిని లేచి



గుమ్మంలోకి వచ్చాను. 50 సంవత్సరాల వయస్సుంటుంది. పల్చగా పొడుగ్గా ఉన్నాడు - ఆ పాదమస్తకం నీళ్లుకారుతున్నాయి. చిన్న చింకిఅంగవస్త్రం కట్టుకున్నాడు - కాళ్లకు పాంకోళ్లున్నాయి. స్నానంచేసి తుడుచుకోకుండా

ఉన్నాడన్నమాట. అతని వెనకచేతిలో అంగవస్త్రం పట్టుకొని అతని భార్య కాబోలు 40 సంవత్సరాలుంటాయి అతి దీనంగా నించుంది - అతడు పళ్లు పటపటకొరుకుతూ "నీకు అంతపొగరుగావుంధే. ఇవాళ నీ నెత్తురుచూడకపోతే నేను [illegible]నే కాను. ఏమనుకున్నావో, నీకంటికంత అన్నాడీగా వున్నానేం..."

పాపం ఆమె కళ్లవెంట నీరుకార్చుకొంటూ "పోనీ ఆ నీళ్లుతుడుచుకొని ఇంత తిండితిని తరవాత నన్నుచంపండి - [illegible]పలికిరండి" అన్నది.

"నీశ్రాద్ధం పెట్టందే యీ కొంపలో అడుగు పెడతానా? నీ పిండానికి కావలసిన సామాను ఇప్పుడే కొని తీసుకొస్తాను - వెధవముండా - నేనేనా సన్యాసం పుచ్చుకోవాలి, లేకుంటే నిన్నేనా సంహరించాలికాని ఈయింట్లో ఇద్దరం ఉండడం జరగదు."

"ఈ యింట్లోంచి నేనేపోతాను మీరే ఉండండి రండి - నామాటవిని ఇంటోకిరండి"

"ఛీ, [illegible]రాను - బజారుకువెళ్లి ముందు నీశ్రాద్ధం పెట్టందే యింటికొస్తాను -" అంటూ పాంకోళ్లు చప్పుడు చేస్తూ గబగబ వెళ్లిపోయినాడు. ఆ యిల్లాలు ఏడుస్తూ అతనివెంటపడి "ఓసా - నామాట వినరూ - మరెప్పుడూ బజారుకు వెళ్లమనను - ఈతప్పు క్షమించండి. ఇదిగో లెంపలేసుకుంటున్నాను" అతడు వినిపించుకోలేదు......"చూశారా పిలుస్తూవుంటే ఆవెళిపోవడం - స్నానంచేసి తుడుచుకోకుండా - మూరుగుడ్డ కట్టుకోకుండా ..." అంది నావంక తిరిగి - నేను "ఏమీజరిగింది" అన్నాను.

"ఏముందినాయనా, ఎప్పుడో ఈకాస్తప్రాణం ఆయన చేతిలో పోతుంది. అప్పుడుకాని ఆయనకు శాంతివుండదు. ఆయన స్నానంచేస్తున్నారు. మూడరోజులనుంచీ ఉప్పు నిండుకుంది. ఆ యింటా యీ యింటా తెచ్చి కాలక్షేపం చేస్తున్నాను - ఆయన తుడుచుకోబోతూవుంటే ఒక్కమారు బజారువంక వెళ్ళేరు కారుకదా అన్నాను. అదీ నావల్లతప్పు. 45 ఏళ్లు వచ్చాయి బజారుకు వెళ్లమనడానికి లేదూ నాకూ - ఏం పిల్లలా, పాపలా, ఎవరున్నారు ఛీ పాడుముండాజన్మ" అని సణుగుతూ ఇంట్లోకి వెళ్లింది.

నేనూ ఇంట్లోకివచ్చి ఈజీఛైరు గుమ్మముందుకు ఈడ్చుకొని కూచున్నాను. ఒక అరగంట దాటిన తరవాత తడి ఆరిపోయిన శరీరంతో వొగర్చుకుంటూ అతడూ, వెనక గంపమనిషీ వచ్చారు. అతడు ఇంట్లో ప్రవేశించి "ఇదిగో మూడుకుంచాలఉప్పు - నీ శ్రాద్ధంపెట్టుకో"

"మూడుకుంచాల ఉప్పెందుకండీ"

"నిన్ను పాతరవెయ్యద్దూ, ఇవాళ నిన్నువిడిచిపెడతాననా - నీప్రాణం పుచ్చుకోకపోతే నా పేరు సుబ్బారాయుడు కాదు."

ఈ కోపిష్టి ముండాకొడుకు అన్నంతపనీ చేస్తాడు కాబోలు, పోలీసులకు రిపోర్టిస్తే ఎందుకైనా మంచిదని ఆలోచించాను. కాని రాళ్లుపేలిపోయేటంత తీవ్రంగాఉన్న యెండచూచి భయపడిపోయినాను. అంతసేపూ "చంపుతాను, నరుకుతాను, కూనీచేస్తాన"న్నమాట తప్ప యింకో మాటే లేదు. ఆ యిల్లాలు సాయంత్రందాకా అలాగ ఏడుస్తూనేఉంది.

౨

రాత్రి ఎనిమిది గంటలయింది - మ్యునిసిపల్ దీపం అవసానదశలో ఉంది. చిన్నసందు కావడంచేత ఏనడిరాత్రో అయినట్టుంది - అంతటా నిశ్శబ్దం ఆకాశంమీద చిరుమబ్బులు తాండవిస్తున్నాయి. కాస్త చూపు ప్రక్కకు మళ్లిస్తే చీకటితప్ప మరేమీ లేదు. ఇంటికొచ్చి కాళ్ళు కడుక్కుందుకు పెరట్లోకి వచ్చాను. అతని ధోరణి అతి తీవ్రంగా వినిపించింది. మా పెరటికీ వారి పెరటికీ మధ్య కాస్త యెత్తుగా ఉన్న రాతిగోడ తప్ప మరేమీ లేదు. ఆ పెరట్లోంచి "వెధవకానా అయిందా - చావు నీ పొగరు అణిగింది కద..."

పాపం ఆమెను చావగొడుతున్నాడు కాబోలు, వెళ్ళి నాలుగు చీవాట్లేద్దామా అనుకున్నాను. ఇంతలో "నిన్ను విడిచి పెడతానా - నిన్ను తెగనరుకుతాను"

చిన్నమూలుగు వినిపించింది "ఊఁ కదులు-కదలవూ-" పెద్దచప్పుడయింది "తెగతిని - మత్తెక్కి నన్ను దబాయిస్తావా - ఎవడనుకున్నావు నీ మనస్సులో. వెధవముండా - ఇవాళ నిన్ను ఖూనీచేస్తాను. కదులు - ఊఁ"

నిజంగా ఈరాత్రి వీడు ఈమెను ఖూనీ చేస్తాడని నిర్ధారణ అయింది.. వెంటనే జోడేసుకొని పోలీసు స్టేషను ఎకాయెకీని పరిగెత్తేను.

ముందు వరండాలో ఒక పోలీసు హెడ్ కాన్‌స్టబుల్ కుర్చీమీద కూచొని టేబిలును ఆనుకొని కునుకుతున్నాడు- మరి ఇద్దరు పోలీసువాళ్ళు దూరాన వెదురుచాపల మీద పండుకున్నారు - దీపంమాత్రం మహాదీనిగా వెలుగుతూంది. నేను లోపల ప్రవేశించి "ఏమండీ సార్ ఖూనీ జరిగిపోతూందండి. కాస్త వేగంపదండీ" అన్నాను - ఆ హెడ్డు త్రుళ్ళిపడి "ఎక్కడ్లి" అన్నాడు గాభరాతో "మా వీధిలోనేనండి, మాయింటి పొరుగునేనండి - కాస్త వేగం వెళ్ళకపోతే పనిచేశేస్తాడండి - ప్రొద్దున్న మొదలు పాట పాడుతున్నాడు - కాస్త వేగంపదండీ సార్"

"అతడెవరు? ఏవీధి"

"అంతా నడుస్తూ చెబుతానుకదూ" ఎలాగైతే నేమి ఇద్దరు పోలీసుకనిష్టీబులనూ లేవనెత్తుకొచ్చాను. త్రోవలో అంతా చెప్పేను. ముగ్గురం మాయింట్లో ప్రవేశించి పెరట్లో గోడపక్క పొంచి నిలుచున్నాం - "ఇవాళ నువ్వు కదలకుంటే నీ పీక నరికైనా నిన్ను తీసికెళతాను కాని నిన్ను విడిచిపెట్టను పద...ఏమి"

ఏదో బరువైన వస్తువును ఈడుస్తూవున్న చప్పుడయింది, నేను "అయ్యా ఆమెను చావమొత్తి కదలలేకుంటే ఈడుస్తున్నాడండి" అన్నాను. ఇంతలో "నీకు నూ రేళ్ళూ నిండబట్టే ఈ పోయేకాలం మూడింది - చావు ముండా చావు" పెద్దచప్పుడయింది. మూలుగుతూ వున్నట్టు వినిపించింది - నాకు ఒక్కసారి గుండెనిలిచి పోయినట్లయింది. "అయ్యా వేగం మనం వెళ్ళకపోతే ఆమె బ్రతకదండి - పదండిసార్ గోడగెంతుదాం" అన్నాను - కాని ఒకడూ ముందుకు కాలువెయ్యడు "నీకెవడు దిక్కొస్తాడో చూస్తాను - వెధవజాతి - నీ తలతీసి ఉప్పు పాతర వేస్తాను చూడు" అంటేను "అయ్యా అంతా అయితేగాని మీరు కదలరు. పోనీ నేనైనా వెళ్ళి ఆమెను కాపాడడానికి ప్రయత్నిస్తాను" అని గోడ ప్రాకబోయినాను - ఇద్దరూ చెరో చెయ్యీ పట్టుకొని నన్ను దించేశారు. ఇంతలో "అయింది - ఇంక - చావు- నీ చావు తగలెయ్యా చావు"

"అయ్యా చంపేశాడండి. అదిగోచప్పుడు - ఇహానైనా పదండి సార్" అన్నాను. ఆ యిద్దరిలో ఒక బుద్ధిమంతుడు - మెల్లిగా "ఆమూలనుంచి ఒకరిమీద ఒకరెక్కి గోడ ఎక్కుదాం - నేను చెప్పేవరకూ తొందరపడి యెవరూ



వాళ్ళ పెరట్లోకి దిగకండి" అని దారితీశాడు. ఒకరి మీద ఒకరు గోడఎక్కేరు - తీరా గోడఎక్కి చూచే సరికి - ఒకదీపంబుడ్డీ పొగలుకక్కుతూ వెలుగుతూంది - దానిపక్క పాంకోళ్ళమీద చేతిలో కఱ్ఱఆనుకొని అతడు ఎదురుగా నిలుచుని నెవురువేస్తూ తనవంక చూస్తూవున్న పెయ్యవంక అతి తీక్ష్ణంగా చూస్తూ వున్నాడు. చప్పుడు చెయ్యకుండా ఆగోడమీద అలాగే కూచున్నాం

"అతడు 'నీయబ్బగారి సొమ్మను కున్నావా - లేస్తావా ఈ కత్తితో ఒక్కపెట్టు పెట్టమన్నావా". అని ఆపెయ్యి మెడదగ్గర కన్నె పట్టుకొని ఊపిరిబంధించి ఒక్కలాగు లాగేడు. ఆ పెయ్య తుప్పున ఒక్కగెంతు గెంతి ఆదీపం బుడ్డీ ఆర్పేసింది - అతడు ఆగ్రహంతో "దొంగముండా - దీపం ఆర్పేస్తావా - ఇవాళ నీప్రాణం పుచ్చుకోకపోతే నాపేరు సుబ్బారాయుడు కాదు - ఔనా యీ వెధవ పెయ్యి, దీపం ఆర్పేశింది. దీపం తీసుకురా"

లోపలనుంచి ఆవిడ "ఏమిటండీ సాయంత్రం ప్రారంభించారు, ఆ పెయ్యతో మనిషితో మాటాడినట్టు దాని ముందు కూచొని అలాగ వర్లిస్తే దానికేం తెలియాలా ఏడవాలా - ఇరుగు పొరుగులవాళ్ళు వింటే నవ్వుతారు మన ఇంటిపొరుగున స్కూళ్ళుగుమస్తా దిగేడట. మధ్యాహ్నం మీ కథవిని ఏమిటని అతడు అడిగేసరికి ఒళ్ళు చచ్చిపోయింది. ఈపాటికి ఆ పెయ్యనికట్టి పడుకోకూడదూ" అంది. ఈ పోలీసువాళ్లల్లో ఒకాయన "మీరేనా అండి స్కూళ్ళుగుమస్తాగారు" అని అడిగాడు.

"ఔనండి" అన్నాను.

"మీకు డిటెక్టివ్ ఉద్యోగం యివ్వాలండి" అని దిగి వెళ్లిపోయారు.

---


# చిరకాలమునుండి బాధించుచున్న మూత్రవ్యాధులకును సెగ (గనేరియా) వ్యాధికిని క్రొత్తగా కనిపెట్టబడిన దివ్యౌషధము

# గొనో కిల్లర్ (రిజిస్టరుడు)

కృత్రిమములను జాగ్రత్త "కోడి మార్కు"ను చూసి కొనుడు

ఈ ఔషధము ఇంగ్లీషు మందులను దేశీయ ఔషధములను పుచ్చుకొనినను గుణము కలుగనియెడలను, యింజక్షనులవలనను, వాక్సినులవలనను గూడ లాభములేక పోయినయెడల, కడపటి ప్రయత్నముగా మా గొనోకిల్లరునుగూడ పుచ్చుకొని చూడుడు. మూత్రము ఝూరీగా వెడలును. మూత్రము పోవుచున్నపుడు కలుగు మంట తగ్గిపోవును. మూత్రనాళమునందలి వాపు తీసిపోవును. మూత్రము బొట్టుగా పడుట, మేహరోగమువలన మూత్రద్వారము నుండి పోవు తెలుపు, మూత్రద్వారముయొక్క వాపు, నరముల జబ్బు మున్నగు వ్యాధులన్నియును స్త్రీలకున్న పురుషులకునుగూడ గొనోకిల్లరువలన కుదురును. ఖరీదు 50 మాత్రలుగల సీసా రు. 3—0—0. కృత్రిమములు చూచి భ్రమజెందవలదు.

మా పుంజుమార్కు గమనింపుడు. వి. పి. చార్జీ ప్రత్యేకము. అడ్రెసు :—డాక్టరు డి. యన్. జసాని

గిర్‌గామ్ వెనుకరోడ్డు, బొంబాయి 4

Dr. D. N. JASANI, Girgaum Back Road, Bombay 4

Madras Agents:—DADHA & CO., Nainiappa Naick St., P. T., Madras